క్లుప్తంగా

సుల్తాన్‌పూర్- ఉమెన్స్ కళాశాల బస్సు ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న శ్రీరాములుయాదవ్, గ్రామస్తులు

బడంగ్‌పేట్: సుల్తాన్‌పూర్ టు ఉమెన్స్ కళాశాల బస్సును శుక్రవారం బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రారంభించారు. మిధాని డిపోనకు చెందిన బస్ 102ఎం.. సుల్తాన్‌పూర్ వయా బాలాపూర్ క్రాస్ రోడ్డు మీదుగా మహిళా కళాశాల వరకు వెళ్లనుంది. బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పలుమార్లు గ్రామస్తులతో కలిసి బీజేపీ నాయకులు ఆ డిపో మేనేజర్‌కు విన్నవించిన నేపథ్యంలో సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సంస్థ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మల్లేషం, శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖరొరెడ్డి, వెంకటేశ్, గ్రామస్తులు ఉన్నారు.

కారోబార్ తొలగింపు


తీర్మానం చేసిన గ్రామస్తులు, అధికారులు

కందుకూరు: కారోబార్ మహేశ్‌ను తొలగించారు. అతనిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం దాసర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి భావన, పంచాయతీ అధికారి లావణ్య ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. మహేశ్‌ను తొలగిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పి.బాలమణి, దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ టి.బాలరాజ్, గ్రామస్తులు శేఖర్, శివ శంకర్‌గౌడ్, రఫీజ్, శ్యామరాజుకృష్ణ, కృష్ణ, శ్రీరాములు, వెంకటేశ్, మహేందర్, శ్రీరాములు, చంద్రశేఖర్, మహేశ్, నర్సింహ, చెన్నయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సాగు యంత్రాలు

కందుకూరు: రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు మంజూరు అయ్యాయని ఏఓ లావణ్య శుక్రవారం తెలిపారు. రోటోవేటర్లు జనరల్ 7, ఎస్సీ,ఎస్టీ రైతులకు ఒక్కొక్కటి చొప్పున, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ జనరల్ 2, డిస్క్ హారస్ కల్టివేటర్లు, ఎంబీ ప్లగ్, కేజీవీల్స్, రోటో పడ్లర్లు జనరల్ 15, ఎస్సీ 3, ఎస్టీ 2, బండ్ ఫార్మర్ జనరల్ 1, పవర్ వీడర్లు జనరల్ 1, బ్రష్ కట్టర్లు జనరల్ 2, పవర్ ట్రిలర్లు జనరల్ 1, మేజ్ సెల్లర్ జనరల్ 1, స్ట్రా బేలర్స్ జనరల్ 2, ఎస్సీ 1, బ్యాటరీ, మాన్యువల్ ఆపరేటింగ్ స్ప్రేయర్లు జనరల్ 124, ఎస్సీ 26, ఎస్టీ 15, పవర్ స్ప్రేయర్లు జనరల్ 22, ఎస్సీ 5, ఎస్టీ 3 వచ్చాయని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, జన రల్ మహిళా రైతులకు 50 శాతం, మిగతా వారి కి 40 శాతం సబ్సిడీతో పరికరాలు అందజేయనున్నామని వెల్లడించారు. అవసరమున్న రైతులు ఆయా క్లస్టర్ల పరిధి రైతు వేదికల్లో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ అధికారుల బస్తీబాట


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పహాడీషరీఫ్: విద్యుత్ అధికారులు బస్తీబాట పట్టారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 7వ వార్డు యాహ్యానగర్‌లో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న తీగలు, వీధి దీపాలు లేక రాత్రి పూట అంధకారం,బుర్హాన్ ఖాన్ చెరువు పరిసరాలలో విద్యుత్ ప్రమాదాలు, లో ఓల్టేజీ సమస్య, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్న స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం వారు పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు చిన్న పిల్లలు అందేంత ఎత్తులో ఉండడం, ఇళ్ల బాల్కానీలను ఆనుకొని వెళ్తున్న వైర్లను మార్చాలని బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ సాంబశివ, కళింగూరి, మోయిన్ తదితరులు టీఎస్ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీరామ్ మోహన్, డీఈ గోపాల కృష్ణ, ఏడీఈ శంకర్ తదితర అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

పీహెచ్‌సీకి రోడ్డు నిర్మించాలి

కందుకూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లే మార్గం అధ్వానంగా ఉందని, వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ రహదారిని ఆయన పరిశీలించి మాట్లాడారు. కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై గుంతలు ఏర్పడి, బురదమయంగా మారిందని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ రాకపోకలు కష్టమేనని తెలిపారు. అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


చంద్రానగర్ బస్తీలో మురుగునీరు


మురళీకృష్ణానగర్ రామాలయం వద్ద బురద

వీధుల్లో మురుగు పారిశుద్ధ్యం కనుమరుగు..


ఇళ్ల మధ్య అడుగులోతు..

వర్షం వచ్చిందంటే ఆ కాలనీల ప్రజలకు డ్రైనేజీ కష్టాలు తప్పవు. వీధుల్లో పారుతున్న మురుగు నీరు, ఇళ్ల మధ్య చేరిన బురదతో ఇక్కట్లు పడుతున్నారు. ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక సతమతమవుతున్నారు. అపరిశుభ్రతతో వెలువడుతున్న తీవ్ర దుర్వాసనతో సావాసం చేస్తున్నారు.

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- బస్తీలను ముంచెత్తిన బురద
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మురళీకృష్ణానగర్, చంద్రానగర్, ప్రశాంత్‌నగర్‌లను మూడు రోజులుగా మురుగునీరు ముంచెత్తుతోంది. దీంతో అక్కడి ప్రజలు ఇళ్లలోంచి అడుగు బయట పెట్టలేని దుస్థితి. ప్రస్తుతం కురుస్తున్న వానలతో పై నుంచి వస్తున్న వరదతో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లి, కాల నీల్లో ప్రవహిస్తోంది. మురుగు నీరంతా ఇళ్లల్లోకి వస్తుందని, అయినా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎవరూ స్పందించడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఆపై అపరిశుభ్రతతో రోగాలు చుట్టుముటే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

బురదమయం

ఆయా బస్తీల్లో ఎక్కడ చూసిన బురదే దర్శనమిస్తోంది. వీధుల్లో అడుగు మేర బురద పేరుకుపోయింది. ఇళ్లు, దేవాలయాలను మురుగు మయం చేసింది. కంపు కొడుతున్నా బయటకు వెళ్లలేక, ఇళ్లల్లో ఉండలేక ఇబ్బంది పడుతున్నామని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో తామే మురుగును తొలగిస్తున్నామని చెబుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇదే సమస్య పునరావృతం అవుతోందని, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ యాప్‌లో ఫిర్యాదు చేసినా స్పందన శూన్యమంటున్నారు.

చర్మ వ్యాధులు



వర్షం వచ్చిందంటే సుమారు 15 రోజులు మురుగుతో సావాసం చేయాల్సిందే. తామే బురదను తొలగించుకుంటున్నాం. దీంతో చర్మ సంబంధిత వ్యాధులు సోకి ఇబ్బంది పడుతున్నాం. – మంగ, మురళీకృష్ణానగర్

పరిష్కరిస్తాం..

వర్షాలు కురిసిన ప్రతిసారి బడంగ్‌పేట ప్రాంతాన్ని వరద నీరు ముంచెత్తుతుంది. బురద పేరుకుపోతుంది. మురళీకృష్ణానగర్ తదితర బస్తీల్లో సమస్య ఉత్పన్నమవుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. 24 గంటల్లో సమస్యను పరిష్కరించి, ఫాగింగ్ చేయిస్తాం.
– నర్సింహ, ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


స్వచ్ఛ ర్యాలీలో మున్సిపల్ అధికారులు, విద్యార్థులు

పహాడీషరీఫ్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. స్వచ్ఛత హీ సేవా-2025లో భాగంగా శ్రీరాం కాలనీలోని ఓ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటి నుంచే స్వచ్ఛతను పాటించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇంట్లోని చెత్తా చెదారాలను.. బాధ్యతగా భావించి మున్సిపాలిటీ ఆటోలో వేయాలని కోరారు. కొందరు అవగాహన లేమితో రోడ్లపై చెత్త పడేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ అర్షద్, పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ మోయిన్ బాబా, పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, సూపర్‌వైజర్ బి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో శారీరక, మానసికోల్లాసం


భానునగర్‌లో ఓపెన్‌జిమ్ ప్రారంభించిన కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: నిత్యం వ్యాయామం చేయటం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఉల్లాసం కూడా పెరుగుతుందని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భానునగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆమె కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వైద్యుల సూచనల మేరకు రోజూ తగిన వ్యాయామం చేయటం ద్వారా శరీరం మరింత చురుగ్గా మారి మానసిక ఒత్తిళ్లను తగ్గిస్తుందని అన్నారు. ఇటీవల పలు కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న ఓపెన్‌జిమ్‌లకు ఆయా కాలనీలవాసుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అందుకని డివిజన్‌లో అవకాశమున్న కాలనీల్లో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విద్యాసాగర్ రెడ్డి, వేణుమాధవ్‌రెడ్డి, నరేష్ నాయక్, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాహక్కు, పోక్సో చట్టంపై అవగాహన


సీనియర్ జడ్జి కిరణ్మయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: మలక్‌పేట బీసీ హాస్టల్‌లలో శుక్రవారం హైద్రాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిటీ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ జడ్జి కిరణ్మయి హాజరై.. లీగల్ సర్వీసెస్ యూనిట్‌లో నల్సా పథకంలో పిల్లల రక్షణ, విద్యార్థులకు విద్యాహక్కు, పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలు ఎలా పొందాలో వారికి వివరించారు. హాస్టల్‌ను తనిఖీ చేసి సౌకర్యాలు పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. హాస్టల్, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు బి. సురేష్‌కుమార్, లతీఫ్ అహ్మద్, వార్డెన్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ మేనేజర్‌గా శ్రీధర్‌రెడ్డి

బడంగ్‌పేట్: మున్సిపాలిటీ కార్పొరేషన్ మేనేజర్‌గా శ్రీధర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో మూడు నెలలుగా ఉన్న ఖాళీగా పోస్టు భర్తీ అయింది. బడంగ్‌పేట నగర పంచాయతీగా కొనసాగుతున్న సమయంలో ఆయన ఇక్కడ మేనేజర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వరుణ్‌రెడ్డి, విజయ్‌కుమార్, కుమార్, ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ భాస్కర్ తదితరులు మేనేజర్‌ను సన్మానించారు.


శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దొడ్డు బియ్యంతోనే మధ్యాహ్న భోజనం

- సన్నాలంటూ.. మోసం చేస్తున్న ప్రభుత్వం
- విద్యావ్యవస్థను పట్టించుకోవడం లేదు
- ఎమ్మెల్యే సబితారెడ్డి


ఉపాధ్యాయులు, విద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం .. దొడ్డు బియ్యంతో పెడుతూ మోసం చేస్తుందని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. సర్కారు బడులను ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని, విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడి ఆవరణలో నీరు నిల్వ ఉండటాన్ని గమనించి, సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారికి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన నిర్వాహకులు మాట్లాడుతూ.. బిల్లులు రావటం లేదని, అయినా సొంత నిధులతో అన్నం వడ్డిస్తున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి.. పాఠశాలల్లో వసతులు కల్పించాలని, విద్యావవస్థపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏంఈఓ కృష్ణ, ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత


కందుకూరు: మండల పరిధి మీర్‌ఖాన్‌పేటకు చెందిన డేరంగుల కిష్టమ్మ.. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే సబితారెడ్డి ద్వారా సీఎంఆర్‌ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకోగా.. రూ.2 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే సబితారెడ్డి బాధిత కుటుంబానికి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఇందులో నాయకులు శేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కుంగిన సీసీరోడ్డు


మరమ్మతు చేస్తున్న సిబ్బంది

బడంగ్‌పేట్: ఎమ్మార్వో కార్యాలయ సమీపంలోని సుబ్రహ్మణ్యం కాలనీకి వెళ్లే సీసీరోడ్డు కుంగిపోయింది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పగిలి, కాలనీకి వెళ్లే డ్రైనేజీ పైప్‌లైన్లు మట్టితో నిండుకున్నాయి. దీని కారణంగా రోడ్డు కుంగింది. విషయం తెలుసుకున్న శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు.. శుక్రవారం మరమ్మతులు చేయించారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో మహిళలు

తుక్కుగూడ: బతుకమ్మ వేడుకలను తుక్కుగూడ పురపాలిక పరిధి జెన్నాయిగూడ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రకరకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి, ఆలయం మాఢ వీధుల్లో ఆడి పాడారు. అనంతరం నీటిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోనమోని శివశంకర్, పిట్టల శ్రీశైలం, ఉప్పునూతల యాదయ్య, సహదేవ్, నరిసింహ్మారావు, ఆలయ పూజారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సమితి నేతలు

మహేశ్వరం: అవినీతికి పాల్పడుతున్న మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, మహాజన సోషలిస్టు సమితి జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కావెంజర్ల వేతనాల్లో రూ.80 వేల అవినీతి జరిగిందని ఆరోపించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 2024 జూలై నుంచి 2025 సెప్టెంబరు వరకు నెలకు రూ.2 లక్షల 80 వేల నిధులు మంజూరయ్యాయని, జీతాల అవినీతిపై 'సాక్షి'లో కథనాలు రావడంతో అప్పటికే రూ.1 లక్షా 44 వేలు ఇచ్చి, తర్వాత గుట్టుగా రూ.36 వేలను స్కావెంజర్లకు ప్రిన్సిపాల్ ఇచ్చారని పేర్కొన్నారు. అక్టోబరు 2024 నుంచి నేటి వరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినని విద్యార్థులు పేరిట, నిత్యం సుమారు 100 నకిలీ బిల్లులు సృష్టించి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. అవినీతిపై విచారణ చేపట్టకుండా విద్యాధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి ఫర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో సమితి మండల ఇన్‌చార్జి రవి, మండల అధ్యక్షుడు ఎర్ర గణేశ్, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు కృష్ణ, సమితి మండల మాజీ అధ్యక్షుడు జంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి నర్కుడ అర్జున్ పాల్గొన్నారు.

కేజీబీవీలో స్వచ్ఛతాహీ సేవ


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, అధికారులు

కందుకూరు: కొత్తగూడ పరిధి కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భార్గవి, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేనకోడలే హంతకురాలు

- వీడిన సైదాబాద్ వృద్ధుడి హత్య కేసు మిస్టరీ
- రెండు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్

సైదాబాద్: సైదాబాద్‌లో కొత్త ఇంటిలో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధుడి హత్య కేసు మిస్టరీ వీడింది. రెండు రోజుల్లోనే కేసును ఛేధించిన సైదాబాద్ పోలీసులు హతుడి మేనకోడలే హంతకురాలిగా గుర్తించారు. హతుడు, హంతకురాలి కుటుంబాల మధ్య కొంత కాలంగా జరుగుతున్న పలు వివాదాల నేపథ్యంలోనే వృద్ధుడి హత్య జరిగిందని పోలీసులు తేల్చారు. శుక్రవారం సైదాబాద్ పోలీస స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. స్థానిక విష్ణునగర్‌లో నివసించే కూలీ కె.శివయ్య (70) తన పాత ఇంటి స్థలంలో కొత్త ఇల్లు నిర్మిస్తూ దగ్గరలోనే మరో ఇంటిలో కుటుంబంతో కలిసి అద్దెకు నివసిస్తున్నాడు. రోజూ కొత్త ఇంటికి రక్షణగా రాత్రి అక్కడ నిద్రించేవాడు. ఆదివారం రాత్రి కూడా అక్కడే పడుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూడగా మరణించి కనిపించాడు. అతని ఒంటిపై ఉండాల్సిన వెండి ఆభరణాలు కనిపించలేదు. మృతదేహం మెడపై గాయాలు కనపడ్డాయి. వారి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు వేగవంతం చేశారు.

◆ మృతుడు శివయ్య ఇంటి సమీపంలోనే అతని మేనకోడలు నేనావత్ మంగ (48) కుటుంబంతో కలిసి ఉంటుంది. ఇరు కుటుంబాల మధ్య ఇటీవల తరచూ గొడవలు అవుతున్నాయి. హత్య జరిగిన రోజు మధ్యాహ్నం కూడా శివయ్య కుటుంబం ఆమెను దూషించారు. ఇవన్నీ మనసులో పెట్టుకున్న మంగ ఆదివారం రాత్రి శివయ్య ఒక్కడే నిద్రిస్తుండటం చూసి వెళ్లి అతని ముఖంపై దిండుతో అదిమి, అక్కడే ఉన్న వైరు తీసుకొని మెడకు బిగించి హతమార్చింది. పోలీసుల దృష్టి మరల్చేందుకు అతని ఒంటిపై ఉన్న వెండి ఆభరణాలు తస్కరించింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించడంతో తన నేరాన్ని ఒప్పుకుంది. ఆమె ఇంటి నుంచి 30తులాల వెండి ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

వృద్ధురాలి కళ్లలో కారం చల్లి, గొలుసు అపహరణ

హస్తినాపురం: గుర్తు తెలియని మహిళముఖం గుర్తు పట్టకుండా ముసుగువేసుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంటికి వచ్చి చేయి కొరికి కంట్లో కారం చల్లి ఆమె మెడలో ఉన్న ఆరు తులాల రెండు బంగారు గొలుసులను తెంచుకుని పారిపోయిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సహార గేటెడ్ కమ్యూనిటీలో రామసుందరి(73) డాక్టర్ నిరంజన్ దంపతులు బహార్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. డాక్టర్ నిరంజన్ శుక్రవారం ఉదయం 6.30గంటలకు వాకింగ్‌కు వెళ్లడారు. రామసుందరి వాష్‌రూంకి వెళ్లి బయటికి వచ్చే సరికి ఒక గుర్తు తెలియని మహిళ ముఖానికి ముసుగు వేసుకుని కారం చల్లి మెడలోని ఆరు తులాల రెండు బంగారు గొలుసులను తెంచుకుని పారిపోయిందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.